# నమస్తే తెలంగాణ

# మెదక్

I | హైదరాబాద్, బుధవారం 11 జూన్ 2025 | MEDAK


## అధికారుల కనుసన్నుల్లోనే రవాణా

వాగుల నుంచి ఇసుకను తరలించే ముందు రూట్‌క్లియర్ చేసుకుంటారు. ఐదారు ట్రాక్టర్ల యజమానులకు కలిపి ఒక గ్యాంగ్ ఉంటుంది. ట్రాక్టర్లలో ఇసుకను సిద్ధం చేసుకున్నాక.. ఆ గ్యాంగ్ ముందుగా ఒక కారులో పోతారు. రూట్ క్లియర్ అని గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగానే ట్రాక్టర్లు బయలు దేరుతాయి.ఈ విషయం పోలీసులకు ముందే సమాచారం ఉంటుంది. ఆ ట్రాక్టర్లు ఒక రూట్‌లో పోతే మరోరూట్‌లో పోలీసులు వెళ్తారు. దీంతో ఆ ట్రాక్టర్లు చేరాల్సిన చోటుకు చేరిపోతాయి. గ్రామాల నుంచి రైతులు పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయగానే, వస్తామని చెప్పి ముందుగానే ట్రాక్టర్ల వాళ్లకు సమాచారం ఇస్తున్నారు. తీరా పోలీసులు అక్కడికి పోయేసరికి ఒక్క ట్రాక్టరు ఉండదు. ఇసుక మాఫియా వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసుకుని సమాచారం ఇచ్చిపుచ్చుకుంటూ దందా సాగిస్తున్నారు. వర్షాలు వస్తే వాగులు నిండుతాయని చెప్పి ముందుగానే కావాల్సిన ఇసుకను వాగు నుంచి తోడి సమీప ప్రాంతాల్లో వారికి అనువైన ప్రదేశాల్లో డంప్ చేస్తున్నారు. ఎక్కడ చూసిన వాగు పరీవాహక ప్రాంతాల్లో ఇసుక డంప్‌లు కనిపిస్తున్నాయి. పక్కనే ఉన్న రైతులు ఎవరికైనా చెబితే మీఅంతు చూస్తాం అంటూ ఇసుక మాఫియా బెదిరింపులకు పాల్పడుతున్నది.



సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపురం వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న దృశ్యం



## పేట్రేగిపోతున్న ఇసుక మాఫియా

- వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ వాగులు ఖాళీ
- పగలురాత్రి తేడాలేకుండా అక్రమ రవాణా
- పోలీసులు, రెవెన్యూ అధికారుల అండదండలు
- నెలనెలా అధికారులకు మామూళ్లు
- నామమాత్రంగా పనిచేస్తున్న టాస్క్‌ఫోర్స్‌లు
- మైనర్ డ్రైవర్లతో ట్రాక్టర్లలో ఇసుక రవాణా
- గంజాయి మత్తులో ట్రాక్టర్లు నడుపుతున్న మైనర్లు
- అడ్డుకునే ప్రయత్నం చేస్తే దాడులు

# వాగులు ఖాళీ

## ఉమ్మడి మెదక్ జిల్లాలో జోరుగా ఇసుక దందా

సిద్దిపేట, జూన్ 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇసుక దందా మూడు పువ్వులు..ఆరు కాయలుగా సాగుతోంది. సిద్దిపేట జిల్లా రాజీవ్ రహదారిపై అధిక లోడ్‌తో ఇసుక అక్రమ లారీలు దూసుకుపోతున్నాయి. రాజీవ్ రహదారి పక్కన అడ్డాలు ఏర్పాటు చేసుకుని ఇసుక దందా సాగిస్తూ అధికార యంత్రాంగం చోద్యం చూస్తున్నది. ఇసుక దందాతో రాజీవ్ రహదారి వెంట ఉన్న పోలీస్‌స్టేషన్లకు మామూళ్లతో కాసుల వర్షం కురుస్తున్నది. సిద్దిపేట జిల్లాలోని నంగునూరు, మద్దూరు, ధూళిమిట్ట, చేర్యాల, కోహెడ మండలాల మీదుగా వెళ్లే మోయతుమ్మద వాగు నుంచి నిత్యం వందల కొద్ది ట్రాక్టర్ల ఇసుక అక్రమంగా తరలుతున్నది. బెజ్జంకి మండలంలో ఇసుక దందా జోరుగా సాగుతున్నది. మెదక్ జిల్లాలో వెల్దుర్తి, కౌల్దారం మండలాల్లో ఇసుక దందా నడుస్తున్నది. దందాకు స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అనుమతుల పేరిట ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. దందాపై ప్రశ్నిస్తే ఇసుక మాఫియా బెదిరింపులకు పాల్పడుతున్నది. ఇసుక, మట్టి మాఫియా గ్యాంగ్‌లు రెచ్చిపోతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇసుక దందా పేరిట భారీగా అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వాగు పరీవాహక ప్రాంతం నుంచి 5 కిలోమీటర్ల వరకు ఒక ట్రాక్టర్ ట్రిప్‌నకు రూ. 3 వేల నుంచి రూ.3500 వరకు తీసుకుంటున్నారు. 20కిలోమీటర్ల లోపు రూ. 5 వేల నుంచి రూ. వేల వరకు దూరాన్ని బట్టి వసూలు చేస్తున్నారు. ఇక వాగులో నుంచి ఇసుక తీసుకురావడానికి రైతుల పొలాల నుంచి వాహనాలు రావాల్సి ఉంటుంది. రైతులు వింటే వారి పొలం నుంచి వాహనం పోయినందుకు ట్రిప్పునకు రూ. 200 నుంచి రూ. 300 చెల్లిస్తున్నారు. వినకపోతే బెదిరిస్తున్నారు. పోలీసులకు, రెవెన్యూ అధికారులకు నెలనెలా మామూళ్లు అందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ట్రాక్టర్ ఇసుకకు రూ. 5వేల నుంచి రూ. 8వేలు ఇస్తున్నారు.

### తూతూమంత్రంగా టాస్క్‌ఫోర్స్‌లు

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లకు కనీసం నెంబర్ ప్లేట్లు ఉండడం లేదు. వ్యవసాయ ట్రాక్టర్ల ద్వారానే ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. వాగుల నుంచి నిత్యం వందల కొద్ది ట్రాక్టరల్లో ఇసుక తరులుతున్నది.అయినా ఎవరికి పట్టింపు లేదు. పగలురాత్రీ అనే తేడా లేకుండా ఇష్టారీతిగా ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్లు వచ్చిన సమయంలో రోడ్డుపై ఇతర వాహనాలపై వెళ్లాలంటే బయపడాల్సిన పరిస్థితి ఉంది. ఎదురుగా వచ్చి ఎక్కడ ఢీకొడతాయన్న భయం వెంటాడుతున్నది. పిల్లలు, ప్రజలు రహదారిపై వెళ్లాలంటేనే వణికి పోతున్నారు.'వాల్టా' చట్టానికి తూట్లు పొడుస్తూ ఇష్టారీతిగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. దీంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. అడ్డుకుంటే దాడులకు దిగుతున్నారు. ఇసుక మాఫియా ఆగడాలపై ఇటీవల ఒక ఎస్సైకి ఫిర్యాదు చేసేందుకు కొందరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే అక్కడ కనీసం ఫిర్యాదు తీసుకోలేదు. ఫిర్యాదు కాపీని తీసుకోండి సార్ అంటే ..ఆ ఎస్సై ఏదో మొహమాటానికి తీసుకున్నారు. ఇలా తీసుకున్నారో లేదో..అక్కడే ఉన్న ఓ వ్యక్తి ఎస్సై చేతిలో నుంచి ఫిర్యాదు కాపీని లాక్కున్నారు. దీనిని బట్టి పోలీసులు కూడా ఇసుక మాఫియాతో ఎంత కుమ్మక్కు అయ్యారో అర్థమవుతున్నది. జిల్లాలో ఇసుక, మట్టి, గంజాయి తదితర వాటి నియంత్రణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్‌లు నామమాత్రంగానే పనిచేస్తున్నాయి. టాస్క్‌ఫోర్స్ క్షేత్రస్థాయి సిబ్బంది ఇసుక మాఫియాకు లొంగిపోయి ముడుపులు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక ట్రాక్టర్‌కు నెలకు రూ. 5 వేల వరకు ఇస్తున్నట్లు సమాచారం. ఒక్కో మండలంలో సరాసరి 100 వరకు ట్రాక్టర్ల వరకు ఉన్నాయి. డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో అధికంగా ఇస్తున్నారు.

### పేరు స్థానిక అవసరాలకు...

స్థానిక అవసరాల పేరుతో వాగుల నుంచి ఇసుకను భారీగా తోడి తరలిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల ప్రోద్భలంతో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నది. అధికారులు మామూళ్లు తీసుకొని ఇష్టారీతిగా స్థానిక అవసరాల పేరిట పర్మిషన్లు ఇస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఇసుక తరలించాల్సి ఉంటుంది. పర్మిషన్ ఎక్కడి వరకు ఉందో అక్కడికి మాత్రమే తరలించారు. కానీ, అది ఎక్కడా అలా జరగడం లేదు. పర్మిషన్ ఓ రెండు ట్రిప్పులు ఉంటే, దాని పేరు మీద 20 నుంచి 50 ట్రిప్పుల వరకు ఇసుకను తరలిస్తున్నారు.

### డ్రైవర్లు అంతా మైనర్లే...

ఇసుక మాఫియా యువతను బాగా వాడుకుంటున్నది. పేద పిల్లలను, జులాయిగా తిరిగే వారిని మచ్చిక చేసుకొని వారికి డబ్బుల ఎర చూపుతున్నది. దీంతో యువత ఇసుక యాఫియా ఆడించినట్లు ఆడుతున్నారు. వీరికి కనీసం డ్రైవింగ్ లైసెన్స్‌లు ఉండకున్నా ట్రాక్టర్లు నడిపిస్తున్నారు. వారిని పనిలో దించే ముందు మందు, గంజాయి తాగిస్తూ, బిర్యాని తినిపిస్తున్నారు. వారితో రాత్రి పూట ట్రాక్టర్లను నడిపిస్తున్నారు. ఆ మత్తులో ట్రాక్టర్‌ను స్పీడ్‌గా తరలిస్తున్నారు. ఎదురుగా ఇతర వాహనాలు వస్తున్న విషయం కూడా గమనించడం లేదు. ఎవరైనా ఇసుక ట్రాక్టరును అపితే అదే స్పీడ్‌తో గుద్దే ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అప్పనపల్లి వాగులో ఇసుక



బీఆర్‌ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారంలో హైదరాబాద్‌లో ఆయనకు శుభాకాంక్షలు తెలిపి, కేకు కట్ చేయించి తినిపించారు.

## తిరుపతిరెడ్డిని ఆశీర్వదించిన కేటీఆర్, హరీశ్‌రావు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 10: బీఆర్‌ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డిని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆశీర్వదించారు. తిరుపతిరెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా మంగళవారం కేటీఆర్, హరీశ్‌రావులను హైదరాబాద్‌లోని వారి నివాసాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేయించి తిరుపతిరెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో బీఆర్‌ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల అంజనేయులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదినం వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ దవాఖానలోని రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ నేతలు చంద్రమోహన్‌గౌడ్, నయీం, గౌస్‌ఖురేషి, జయరాజు, మధు, కిరణ్, రాములు, నాగరాజు, సుఫీ, నవీన్, కిష్టయ్య, బాలేష్, రవీందర్, కిరణ్‌గౌడ్, మాయ మల్లేశం, అంజనేయులు, సతీశ్‌రావు, రంజిత్, మంగ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.



తిరుపతిరెడ్డిని శాలువాతో సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

## రేవంత్‌ది పైశాచిక ఆనందం



గజ్వేల్‌లో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

- రూ.94వేల కోట్లు ఖర్చు పెడితే లక్ష కోట్ల అవినీతి ఎక్కడ
- ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టు కాళేశ్వరం
- రాష్ట్రాభివృద్ధిపై చిత్తశుద్ధి, విజన్ లేని రేవంత్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ధ్వజం

గజ్వేల్, జూన్ 10: రాష్ర్టాన్ని సాధించి పదేండ్లలో దేశానికే గర్వకారణంగా తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లిన కేసీఆర్‌కు కాళేశ్వరం ప్రాజెక్టుపై నోటీస్‌లు రావడంతో రేవంత్‌రెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నారని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టు కాళేశ్వరం కేసీఆర్ నిర్మించారన్నారు. ప్రాజెక్టుకు రూ.94వేల కోట్లు ఖర్చు పెడితే రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని మాట్లాడడం కాంగ్రెస్ నేతల అవివేకానికి నిదర్శనమన్నారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తే తమ ఉనికి ఎక్కడ కోల్పోతామోననే భయంతో కాళేశ్వరం పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం బద్నాం చేస్తున్నదని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, హామీలు విస్మరించి రేవంత్ సర్కారు కాలయాపాన చేస్తున్నదని వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతు బీమా వంటి సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే చెల్లిందన్నారు. మేడిగడ్డ బ్యారేజ్‌కు మరమ్మతులు చేయించాల్సింది పోయి ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరించడం రాష్ట్రానికి నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. హరీశ్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ ప్రజెంటేషన్ ఇచ్చి ప్రజలకు, కమిషన్‌కు అర్థమయ్యేలా సమాధానం చెప్పారన్నారు. సమావేశంలో గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ పాండుగౌడ్, పార్టీ మండల అధ్యక్షులు నవాజ్‌మీరా, నునె కుమార్, మాజీ కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, నాయకులు రామచంద్రం, దుర్గయ్య, అమరేందర్, రమేశ్‌గౌడ్, నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణాగౌడ్, దయాకర్‌రెడ్డి, నర్సింగరావు, గొడుగు స్వామి, ఆంజనేయులు, స్వామి చారి, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థలను సమర్థవంతంగా నిర్వహించాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 10: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీలు, గురుకుల పాఠశాలలను సమర్థవంతగా నిర్వహించాలని, విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి సిద్ధం చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో సంక్షేమ వసతి గృహాల ప్రిన్సిపాళ్లు, కేజీబీవీల ప్రత్యేకాధికారుల, వసతి గృహాల వార్డెన్లతో 2025-26 విద్యాసంవత్సరం నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం శుభ్రమైన ఆహారం అందించాలన్నారు. వంట గదుల్లో శుభ్రత, వంటల సామగ్రి, సరుకులు, నాణ్యమైన ఆహారాన్ని అందించడానికి కఠినమైన నిబంధనలు పాటించాలన్నారు. గతేడాది అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఈసారి పక్కాగా మెనూ అమలు చేయాలని సూచించారు. ప్రతి విద్యాసంస్థలో టీచింగ్, నాన్ టీచింగ్ ఉపాధ్యాయులు, కుక్ కమిటీలతో సమావేశాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు అమలును పర్యవేక్షించాలన్నారు. మౌలిక వసతుల కల్పన, మరుగుదొడ్ల శుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గుణాత్మకమైన విద్య అందించంతో పాటు మానసిక శారీరక, ధృడత్వానికి క్రీడలపై విద్యార్థులకు ఆసక్తి కల్పించాలన్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేశ్, డీఈవో రాధాకిషన్, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ, ఎస్సీ సంక్షేమ అధికారి శశికళ, బీసీ సంక్షేమ అధికారి జగదీశ్, మైనారిటీ సంక్షేమ అధికారి జెమ్లా నాయక్, అకడమిక్ అధికారి సుదర్శన్‌మూర్తి, ప్రిన్సిపాళ్లు, హెచ్ఎంలు, వార్డెన్లు పాల్గొన్నారు.



ప్రవేశాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

### ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరణ

2025-26 విద్యా సంవత్సరానికి రామాయంపేట సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆదనపు కలెక్టర్ నగేశ్, జిల్లా కోఆర్డినేటర్ శిరీష తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కళాశాలల్లో 60 శాతం సోషల్ వెల్ఫేర్ విద్యార్థినులకు, 40 శాతం బయట విద్యార్థినులకు ప్రవేశాలు కల్పిస్తామని కలెక్టర్ వెల్లడించారు. మిగతా వివరాలకు సెల్: 80966 91184, 96425 79305 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## నిమ్జ్ భూములకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న సంజయ్ కుమార్, వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 10: నిమ్జ్ భూములకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని, మొదటి దశలో సేకరించిన భూములకు సంబంధించిన రక్షణ కంచెలు, పరిహార చెల్లింపు పనులు త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్ కలెక్టర్‌కు సూచించారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన సంజయ్ కుమార్ కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్‌తో కలిసి నిమ్జ్, రెవెన్యూ అధికారులతో భూసేకరణ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యదర్శి మాట్లాడుతూ.. మొత్తం12,630 ఎకరాల సేకరణకు ఇప్పటికే 7300 ఎకరాలు భూసేకరణ పూర్తయినట్టు తెలిపారు. నిమ్జ్ ప్రాజెక్టు పూర్తయితే జిల్లాలో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లింపు చేపట్టిందన్నారు. నిమ్జ్ భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేసి ప్రాజెక్టును సకాలంలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో టీజీఐపీసీ వైస్ చైర్మన్ విష్ణు వర్ధన్ రెడ్డి, ఆర్డీవో, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## అన్నప్రసాదం పంపిణీ గొప్ప భాగ్యం

- అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి చైర్మన్ చీకోటి మధుసూదన్



సిద్దిపేటలో అన్నదాన గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న సేవా సమితి ప్రతినిధులు

సిద్దిపేట టౌన్, జూన్ 10: అమర్‌నాథ్‌లోని మంచులింగం వద్ద 14వ సారి అన్నదానం చేయడం దైవ సంకల్పమని అన్నదాన సేవా సమితి చైర్మన్,చీకోటి మధుసూదన్, అధ్యక్షుడు కాంచం కాశీనాథ్ అన్నారు. అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమవుతున్న నేపథ్యంలో అన్నదాన సేవా సమితి 14వ సారి అన్నదానం చేయాలని సంకల్పించినట్లు వారు తెలిపారు. మంగళవారం సిద్దిపేటలోని దాసాంజనేయ స్వామి ఆలయంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఎముకలు కొరికే మంచు కొండల్లో అమరానాథ్‌లో అన్నదాన వితరణ చేసే భాగ్యం కలగడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం దక్షిణాది వంటకాలను పరమశివుని భక్తులకు అందిస్తున్నట్లు తెలిపారు. అమర్‌నాథ్‌కు వెళ్లే యాత్రికులకు మూడు చోట్ల అన్నదానం చేస్తామని తెలిపారు. ఈనెల 12న స్థానిక శరభేశ్వర ఆలయంలో ముందుగా శివపార్వతుల కల్యాణం, అమర్‌నాథ్‌కు తరలే ఆహార పదార్థాల వాహనాలకు పూజ ఘనంగా నిర్వహిస్తామన్నారు. పూజా కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు, మెదక్ ఎంపీ రఘునందన్, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, నిజామాబాద్ ఎమ్మెల్యే సూర్యనారాయణ హాజరవుతారని తెలిపారు. అంతకుముందు అన్నదాన సేవా సమితి గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శివ్వా శ్రీనివాస్,ఉప్పల భూపతి, గోపిశెట్టి శరభయ్య, రాములు, ఈశ్వర్ చరణ్, లక్ష్మణ్, మంకాల నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

## భూసమస్యలపై అర్జీలు పెట్టుకోవాలి

- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

దుబ్బాక, జూన్ 10: భూసమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి కార్యక్రమాన్ని తెచ్చిందని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. మంగళవారం దుబ్బాక మండలం అప్పనపల్లిలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భూ సమస్యలున్నవారు సదస్సులో అర్జీ పెట్టుకోవాలని సూచించారు. అర్జీలను రెవెన్యూ అధికారులు పరిశీలించి, సమస్యను పరిష్కరించేందుకు గడవు ఇస్తారని తెలిపారు. ఈనెల 20 వరకు గ్రామాల్లో భూ భారతి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



అప్పనపల్లిలో భూభారతి సదస్సులో అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

### మెరుగైన వైద్య సేవలందించాలి

ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి సూచించారు. దుబ్బాక వంద పడకల దవాఖానను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖానలో వైద్య వసతులు, పరికరాలు, రికార్డులను పరిశీలించారు. ప్రసవాల సంఖ్య, నార్మల్ డెలివరీలు, శస్త్ర చికిత్సల వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట దవాఖాన సూపరింటెండెంట్ హేమరాజ్‌కు సూచించారు.

### ఈనెల 30 వరకు రేషన్ బియ్యం పంపిణీ

దుబ్బాక మండలం హబ్షీపూర్‌లోని రేషన్ దుకాణాన్ని కలెక్టర్ మనుచౌదరి పరిశీలించారు. బియ్యం పంపిణీ ఈనెల 30 వరకు కొనసాగుతుందని, ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు.

## సాగు పనులు షురూ..



సిద్దిపేట జిల్లా గజ్వేల్ శివారులోని ఓ చేనులో ఎడ్లతో దుక్కి దున్నతున్న రైతు



సిద్దిపేట రూరల్ మండలం రావురూపులలో మొక్కజొన్న విత్తులు విత్తుతున్న కూలీలు

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే రావడంతో సిద్దిపేట జిల్లాలో వానకాలం సాగు పనులు షురూ అయ్యాయి. వర్షాలు కురుస్తుండడంతో రైతులు సాగుపనుల్లో నిమగ్నమయ్యారు. గజ్వేల్, నంగునూరు, సిద్దిపేట తదితర ప్రాంతాల్లో రైతులు అరక దున్నడం, పత్తి విత్తనాలు విత్తడం, వరినాట్లు వేస్తున్నారు. చేన్లు రైతులు, రైతు కూలీలతో సందడిగా మారాయి.

– నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట (జూన్ 10)



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అంశాపూర్‌లో వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు